క్లుప్తంగా

వెంకన్న ఆలయంలో విశేషంగా హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం హోమాన్ని విశేషంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని హోమగుండం వద్ద చక్రపెరుమాళ్లను అధిష్టం పజేశారు. విష్వక్సేనపూజ, ,పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి సతీ సమేతంగా హోమంలో పాల్గొన్నారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు శ్రావణ్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం



గ్రంథాలయంలో వ్యాయామం చేస్తున్న విద్యార్థులు

సబ్బవరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా సాగుతోంది. శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు వ్యాయామంపై అవగాహన కల్పించారు. ప్రతిరోజు వ్యాయం చేయడం ద్వారా శారీరక ధృడత్వం కలిగి ఉండడంతో పాటు రోజంతా ఉత్సాహంగా ఉండి జ్ఞాపక శక్తి పెరుగుతుందని గ్రంథాలయ అధికారి శిరీష తెలిపారు.వ్యాయామం చేయడం దినచర్య కావాలని విద్యార్థులకు సూచించారు.

సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి తదితరులు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం బయో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'ట్రెండ్స్ ఇన్ ఎమర్జింగ్ నానో బయో టెక్నాలజీ–కరెంట్ అప్లికేషన్స్ అండ్ ఫ్యూచర్ ప్రాస్పెక్టస్' సదస్సు పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. జూలై 15వ తేదీన ఏయూ టీఎల్ఎన్ సభా మందిరంలో ఈ జాతీయ సదస్సు నిర్వహిస్తారు. పోస్టర్ ఆవిష్కరణలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, అకడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య ఎస్.ఎస్.కిషోర్‌బాబు, సదస్సు కన్వీనర్ ఆచార్య పి.రాధిక తదితరులు పాల్గొన్నారు.

2న 'దర్శిని' చిత్ర బృందానికి అభినందన

మద్దిలపాలెం : వికాస్, శాంతి హీరో, హీరోయిన్లుగా డాక్టర్ ప్రదీప్ దర్శకత్వంలో రూపొందించిన దర్శిని చిత్ర బృందాన్ని జూన్ 2న విశాఖలో అభినందించనున్నట్లు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రతినిధి నరవ ప్రకాశరావు తెలిపారు. రెండు వారాల క్రితం 100కి పైగా థియేటర్లలో విడుదలై ప్రేక్షకుల ఆదరణ పొందుతుందన్నారు. వి–4 క్రియేషన్స్ పతాకంపై ఎల్.వి.సూర్యం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ చిత్రంలో నటించిన హీరోతో పాటు ఇతర నటీ నటులు, అన్ని విభాగాల సాంకేతిక నిపుణులు విశాఖకు చెందిన వారేనని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ, రంగసాయి నాటక సంఘం వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి సంయుక్తంగా స్థానిక పౌర గ్రంథాలయంలో చిత్ర బృందాన్ని అభినందించనున్నట్లు తెలిపారు. ఈ అభినందన సభలో మేకింగ్ దర్శిని మూవీ పేరిట ఉచితంగా చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్టార్ మేకర్ లంక సత్యానంద్, నగర ప్రముఖులు హాజరు కానున్నారన్నారు. సినీప్రియులు, ఔత్సాహిక దర్శకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

భానుడి భగభగ

- జనం విలవిల
- నిర్మానుష్యంగా రోడ్లు



ఖాళీగా రావాడ–ధర్మారాయుడుపేట రోడ్డు



మండుటెండకు తిక్కవానిపాలెం తీరంలో సేద దీరుతున్న గ్రామీణ ప్రజలు

పరవాడ: ఎండలు మండుతున్నాయి. వారం రోజులుగా ఇదే పరిస్థితి ఉండడంతో ఉదయం 9 గంటలు దాటితే బయటకు రావడానికి ప్రజలు భయపడుతున్నారు. రోహిణి కార్తె ప్రవేశంతో ఎండలు మరింతగా ముదరడంతో ప్రజలు ఉక్కపోతకు గురవుతున్నారు. ఎండ వేడిమికి తట్టుకోలేక చిన్నా పెద్ద తేడా లేకుండా ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలకు చేరుకొని జలకాలాటలతో వేసవి తాపాన్ని తీర్చుకుంటున్నారు. మండుతున్న ఎండల కారణంగా ప్రజలు తమ ప్రయాణాలను వాయిదా వేసుకుంటున్నారు. దీంతో రహదారుల వెంబడి ఏర్పాటు చేసిన దుకాణాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

విద్యుత్ కోతలతో..

విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం తలెత్తడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఏసీలు, ఫ్యాన్లు పనిచేయక విలవిల్లాడుతున్నారు. అదేవిధంగా ఎండలకు భయపడి ఉపాధి కూలీలు కూడ ఉదయం 6 నుంచి 10 గంటల వరకు పనులను చేసి ముగిస్తున్నారు.

ఊరేగింపులకు అనుమతి లేదు

- కౌంటింగ్ రోజు అంతా సామరస్యంగా మెలగాలి
- డీఎస్పీ సత్యనారాయణ



గంగవరం గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ

సబ్బవరం: ఎన్నికల కౌంటింగ్ రోజూ అంతా సోదర భావంతో మెలగాలని పరవాడ డీఎస్పీ సత్యనారాయణ సూచించారు. జీవీఎంసీ పరిధిలోని వెదుళ్లనరవ,గంగవరం గ్రామాల్లో సీఐ పిన్నింటి రమణతో కలిసి బుధవారం ఆయన ఎన్నికల నియమావళిపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఎన్నికల్లో పోటీ చేసిన తర్వాత గెలుపు ఓటములు సాధారణమైన విషయమేనన్నారు. ఆయా పార్టీల అభిమానులు వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. కౌటింగ్ రోజున ఊరేగింపులకు,సభలకు దూరంగా ఉండాలన్నారు.బాణసంచా కాల్చులు,లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలు పార్టీల నాయకులతో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. అప్పన్న నిత్యకల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం నేత్రపర్వంగా జరిపించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి ఉదయం 9.30 నుంచి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం అనంతరం సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలలో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేష వస్త్రాలు అందజేశారు.

వెంకటాపురంలో కార్డన్ సెర్చ్



వెంకటాపురం మూడు గుడుల జంక్షన్ వద్ద పోలీసులకు సూచనలిస్తున్న సీఐ సురేష్

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురంలో వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి ఆధ్వర్యంలో బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లతో పాటు గ్రామ పరిసరాల్లో నిశితంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ నరసింహమూర్తి మాట్లాడుతూ సీపీ రవిశంకర్ అయ్యర్ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేట్టామని తెలిపారు.

జూన్ నెల 4న ఎన్నికల కౌంటింగ్ ఉన్న నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎవరూ ఆవేశాలకు గురి కావద్దని, నేరాలు, అల్లర్లకు పాల్పడవద్దని సూచించారు. ఎవరైనా అటువంటి చర్యలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. సెర్చ్‌లో ఎటువంటి పత్రాలు లేని 15 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో గోపాలపట్నం సీఐ సురేష్, ఎస్ఐలు అప్పలనాయుడు, రామకృష్ణ, పెందుర్తి సీఐ రామకృష్ణ , ఎయిర్‌పోర్టు సీఐ చక్రధర రావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 39 మంది గైర్హాజరు

మద్దిలపాలెం : డాక్టర్ వి.ఎస్. కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 39 మంది గైర్హాజరయ్యారని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కృష్ణారావు తెలిపారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు 357 మంది హాజరు కావాల్సి ఉండగా 340 మంది హాజరయ్యారని, 17 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. వీరిలో ఫిజిక్స్ పరీక్షకు 9 మంది, ఎకనామిక్స్‌కు 8 మంది హాజరు కాలేదని ఆయన తెలిపారు. కాగా మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సం పరీక్షకు 495 మంది హాజరు కావాల్సి ఉండగా 473 మంది హాజరు కాగా 22 మంది హాజరు కాలేదన్నారు. వీరిలో ఫిజిక్స్‌కు 11 మంది, ఎకనమిక్స్‌కు 11 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ.. ప్రజల బాధ్యత



పర్యావరణ దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీసీబీ అధికారులు, గ్రీన్ క్లైమేట్ టీం ప్రతినిధులు

మద్రిపాలెం: భూగోళం మీద ఉన్న సమస్త జీవరాశులను, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని విశాఖపట్నం డివిజన్ కాలుష్య నియంత్రణ మండలి జాయింట్ చీఫ్ ఇంజినీర్ కె.రమేష్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మాధవధారలోని సంస్థ కార్యాలయంలో ఆయన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏపీ పీసీబీ, గ్రీన్‌క్లైమేట్ టీం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవం మన భూమి అంశంపై జరుగుతుందని తెలిపారు. భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును తట్టుకునే శక్తిపై దృష్టి సారించాలని ఐక రాజ్య సమితి పిలుపునిచ్చిందన్నారు. రీజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.వి.ముకుందరావు మాట్లాడుతూ విశాఖలో చిత్ర లేఖనం వంటి పోటీలు జరుగుతాయని చెప్పారు. అనకాపల్లి, మన్యం జిల్లాల్లోనూ స్వచ్ఛంద సంస్థల సహకారంతో పర్యావరణ అవగాహన కార్యక్రమాలు తలపెట్టామన్నారు. అసిస్టెంట్ ఇంజినీర్ ఎ.ఎస్.ఆర్.సి.మూర్తి మాట్లాడుతూ, భావితరాలను దృష్టిలో ఉంచుకుని జీవన నాణ్యతను మెరుగుపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో మండలి ఈఈ కరుణరేఖ , ఏఈ శ్రీలక్ష్మి, సైంటిఫిక్ ఆఫీసర్ సంయుక్త, రీసెర్చ్ అసోసియేట్ గౌతమి, సిఫా ట్రస్టు సీఈవో డాక్టర్ శశిప్రభ, గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం, వలంటీర్ రాజేశ్వరి, సిఫా ట్రస్టు సిబ్బంది, నర్సింగ్, హేమ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి శాంతి కల్యాణం



శాంతి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్‌బీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో కొలువుదీరిన శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి శాంతి కల్యాణాన్ని బుధవారం కనులపండువగా నిర్వహించారు. వేంకటేశ్వర స్వామి జన్మతార శ్రవణా నక్షత్రం సందర్భంగా శాంతి కల్యాణం జరిపించినట్లు దివ్యక్షేత్రం ఆస్థాన అర్చకులు తెలిపారు. దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

పైడితల్లమ్మ ఆలయ వార్షికోత్సవానికి వేళాయె



గొల్లలపాలెంలో కొలువైన పైడితల్లమ్మ, ముస్తాబైన అమ్మవారి ఆలయం

సబ్బవరం: మండలంలోని పెదగొల్లలపాలెంలో కొలువైన పైడితల్లమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ మొదటి వార్షికోత్సవం పురస్కరించుకొని అమ్మవారి సన్నిధిలో 108 కలశాలతో అభిషేకాలు,చండీ హోమం,చండీ పారాయణం జరుగుతుందన్నారు. సాయంత్రం 7 గంటల నుంచి సామూహిక కుంకుమ పూజ,సహస్ర నామార్చన, దీపాలంకరణ నిర్వహించనున్నారు.మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్నం శ్రీకాకుళం వారిచే కూచిపూడి, భరత నాట్యం ప్రదర్శించబడుతుందన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని పిలుపునిచ్చారు.

మలయాళ నవల 'ఆడు జీవితం'పై ప్రసంగం



ప్రసంగిస్తున్న రచయిత కె.జి.వేణు

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో కేరళ సాహిత్యంపై జరిగిన సాహితీ కార్యక్రమంలో మలయాళ రచయిత, కేరళ సాహి త్య అకాడమీ అవార్డు గ్రహీత బెన్యామిన్ రచించిన ఉత్తమ మలయాళ నవల 'ఆడు జీవితం' పై రచయిత, డాక్టర్ కె.జి.వేణు ప్రసంగించారు. సౌదీ అరేబియాలో వలస వచ్చిన కార్మికులను ఎలా బానిసలుగా మారుస్తారో చెప్పే నవలగా పేర్కొన్నారు. కేరళలోని ఒక గ్రామంలో బోటు నడుపుకుని జీవించే నజీబ్ అనే వ్యక్తి వ్యాపారం బాగాలేదని గల్ఫ్ దేశాలకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకోవాలని అనుకుంటాడన్నారు. ఒక ఏజెంట్ ద్వారా సౌదీ అరేబియాకు చేరుకున్న నజీబ్ అక్కడ పడిన కష్టాలను, దుర్భర బానిస జీవితాన్ని నవలాకారుడు హృదయానికి హత్తుకునేలా రాశారన్నారు. బలమైన కథనం, కథతో నవల చాలా బిగింపుగా సాగిపోతుందని వివరించారు. ఉత్తమ నవలగా 'ఆడు జీవితం' చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు, రచయితలు ఎస్.విజయ్‌కుమార్, శేఖరమంత్రి ప్రభాకర్, డి.వి.సూర్యారావు, చిన సూర్యనారాయణ, కొత్తూరి రమణ, కుప్పిలి భీమేశ్వరరావు, కె.వి.ఎస్.మూర్తి, ఉప్పల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

మురళీనగర్: ప్రపంచ పర్యావరణ దినోత్సవా న్ని పురస్కరించుకొని మురళీనగర్ బాలభాను విద్యాలయం ప్రాంగణంలో మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జూన్ 2న విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు 'ప్రపంచ పర్యావరణం–పరిరక్షణ' అనే అంశంపై పోటీ జరుగుతుందన్నారు. 3–5 తరగతులు, 6–8 తరగతులను ప్రత్యేక విభాగాలుగా ఏర్పాటు చేసి పోటీలు నిర్వహిస్తామన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందిస్తామని చెప్పారు. విద్యార్థులకు డ్రాయింగ్ షీట్స్ ఇస్తామని, క్రేయాన్స్, కలర్స్‌లు వారే తెచ్చుకోవాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 94926 41242, 91210 07683 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

1న అభయాంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం



అభయాంజనేయస్వామి ఆలయం

పెందుర్తి: మండలంలోని పినగాడి పంచాయతీ వెల్ఫేర్ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయాన్ని శనివారం ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. శనివారం ఉదయం 6 గంటలకు విగ్రహావిష్కరణ జరుగుతుందన్నారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు భారీ ఎత్తున అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలంతా హాజరు కావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



శివకుమారి(ఫైల్)

పరవాడ: కలపాక శివారు పెదస్వయంభూవరం గ్రామానికి చెందిన యాదగిరి శివకుమారి(31) మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందినట్టు సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు. ప్రమాదానికి సంబంధించి సీఐ బాల సూర్యారావు అందించిన వివరాలు.. పెదస్వయంభూవరం గ్రామానికి చెందిన యాదగిరి శివకుమారి మంగళవారం కూలి పనులకు వెళ్లి సాయంత్రం స్వగ్రామానికి చేరుకోవడానికి ట్రాక్టర్ ఎక్కింది. అయితే వెన్నలపాలెం–సోమునాయుడు గ్రామాల మధ్య మలుపు వద్ద ట్రాక్టరు డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో వాహనం అదుపు తప్పింది. ఈ క్రమంలో తొట్టిలో కూర్చొన్న శివకుమారి ట్రాక్టర్ ఇంజిన్‌కు తొట్టికు మధ్య ఇరుక్కుపోయింది. ఈ ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. శివకుమారి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని సీఐ బాలసూర్యరావు చెప్పారు.

కుటుంబ వ్యవస్థ పరిరక్షణకు కృషి



మాట్లాడుతున్న మానసిక వైద్యుడు విజయ్‌కుమార్

సీతంపేట: సమైక్య భారతి ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'కుటుంబ వ్యవస్థ పరిరక్షణ' అనే అంశంపై సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా మానసిక వైద్యుడు మోపిదేవి విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కావడానికి కార్పొరేట్ విద్యను అభ్యసించిన విద్యాధికులు అవలంబిస్తున్న ఆర్థిక విధానాలే ప్రధాన కారణమన్నారు. ఆచార్య సి.మంజులత మాట్లాడుతూ కుటుంబ సభ్యులు కలిసి చర్చించుకునే పద్ధతి లోపించడం వల్ల ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగైందన్నారు. ఎం.రూపవాణి మాట్లాడుతూ మహిళలు ఐకమత్యంగా ఉంటే చిన్న కుటుంబాలుగా విడిపోవన్నారు. సమైక్య భారతి జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య మాట్లాడుతూ బిజీ జీవితంలో కుటుంబ సభ్యులు కలిసి కూర్చుని మాట్లాడుకునే వీలు కూడా లేకుండా పోయిందన్నారు. కుటుంబ సభ్యులు అంతా కలిసి భోజనం చేస్తూ ఒకరి అభిప్రాయాలు ఒకరు చర్చించుకుని కష్టసుఖాల్లో తోడు ఉండేలా ఉండాలని పేర్కొన్నారు. భావితరాలకు మంచి సందేశాన్ని ఇచ్చేలా, కుటుంబ వ్యవస్థ గొప్పతనాన్ని పిల్లలకు తెలియజేయాలన్నారు. రచయిత మేడా మస్తాన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు చినసూర్యనారాయణ, డాక్టర్ కె.వి.ఎస్.మూర్తి, చింతా ప్రభాకర్, ఫణిస్వామి, పత్తి ప్రసాద్ తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అనంతరం ఎంవీఆర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గాయణీ గాయకులు సినీగీతాలు ఆలపించి అలరించారు.

అనుమతుల్లేని నిర్మాణాలకు నోటీసులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు పరిధి సుసర్ల కాలనీలో అనుమతుల్లేకుండా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవన నిర్మాణదారులకు జీవీఎంసీ ప్లానింగ్ విభాగం అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ విషయాన్ని సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ సుశీల్ ధ్రువీకరించారు. కొంతమంది సరైన అనుమతులు పొందకుండానే అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారనే ఫిర్యాదుల మేరకు ముందస్తు నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. అదనపు అంతస్తులు నిర్మిస్తున్న భవనాలను జీవీఎంసీ ప్లానింగ్ విభాగం ఉన్నతాధికారులు కూడా పరిశీలన చేశారు. తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నారు.

దువ్వాడ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన డీసీపీ

- మూడు మాసాలుగా స్పందనలో ఫిర్యాదులు లేకపోవడంపై ప్రశంసలు



సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ సత్తిబాబు

అగనంపూడి: దువ్వాడ పోలీస్‌స్టేషన్‌ను నగర డిప్యూటీ పోలీస్ కమిషనర్ మేకా సత్తిబాబు బుధవారం సందర్శించారు. ఈ స్టేషన్ పరిధిలో గత మూడు మాసాల్లో ఒక్క స్పందన ఫిర్యాదు లేకపోవడంపై ఇక్కడి అధికారులను ప్రశంసించారు. ముందుగా ఆయన స్టేషన్ ఆవరణను పరిశీలించారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ కేసుల చార్జిషీట్లు పరిశీలించారు. తరువాత సిబ్బందితో మాట్లాడారు. సమస్యలు ఉంటే చెప్పాలని సిబ్బందిని కోరారు. ఆయన మాట్లాడుతూ గత కొన్నాళ్లుగా వారం వారం ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమానికి ఈ స్టేషన్ పరిధి నుంచి ఫిర్యాదులు లేకపోవడంపై ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ సీఐ ఎర్రంనాయుడును, సిబ్బందిని ప్రశంసించారు.

వాహనచోదకుడికి తీవ్ర గాయాలు



అక్కిరెడ్డిపాలెం: పాదచారుడిని ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి, వాహనచోదకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. వివరాలివి.. అక్కిరెడ్డిపాలేనికి చెందిన నేలపాటి శ్యాంబాబు బుధవారం రాత్రి ఖైల్ సిగ్నల్ పాయింట్ నుంచి నాతయ్యపాలెం వైపు సర్వీసు రోడ్డులో నడిచి వెళ్తున్నారు. అదే సమయంలో ఏపీ 31 డీక్యూ 9301 నంబరు గల హోండా యాక్టీవాపై సుమారు 50 సంవత్సరాలు పైబడిన గుర్తు తెలియని వ్యక్తి పాదచారుడిని వాహనంతో వెనుక నుంచి ఢీకొట్టారు. దీంతో వాహనంపై ఉన్న వ్యక్తి అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో ఆయన తలకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న గాజువాక ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, 108కు సమాచారం అందించారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. గాయాలపాలైన వ్యక్తికి సంబంధించిన వివరాలేమీ లేకపోవడంతో ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పోలీసులు గాజువాక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పాదచారుడికి చేతికి స్వల్పగాయాలయ్యాయని తెలిపారు.

ప్రభుత్వరంగ సంస్థల నిర్వీర్యమే బీజేపీ అజెండా



దీక్ష శిబిరంలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

అగనంపూడి: లాభాల బాటలో ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయడం, తద్వారా వారికి అనుకూలంగా ఉన్న పెట్టుబడిదారుల చేతుల్లో తక్కువ ధరకు తాకట్టుపెట్టడం బీజేపీ ప్రభుత్వ అజెండాగా కొనసాగుతోందని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు వరసాల శ్రీనివాసరావు అన్నారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో 1203వ రోజు దీక్ష శిబిరంలో వారు మాట్లాడారు. కార్పొరేట్ చేతుల్లో తోలు బొమ్మలుగా మారిన బీజేపీ ప్రభుత్వ పెద్దలు ఒక రాష్ట్రానికి చెందిన బడాబాబులకు దేశంలోని జాతీయ సంపదను దోచిపెడుతున్నారని ఆరోపించారు. మూడు సంవత్సరాలుగా ఉక్కు పరిరక్షణ కోసం చేస్తున్న దీక్షలను కేంద్ర ప్రభుత్వం గుర్తించకపోయినా దేశ ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. రాష్ట్రానికి ఆయువుపట్టులాంటి విశాఖ ఉక్కు విషయంలో కేంద్రం తప్పిదాలను సరి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సన్యాసిరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.